సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



మండపేటలో ప్రగతి జెండా

మూడు నియోజకవర్గాలకు వ్యాపార కేంద్రంగా పేరొందిన మండపేట పట్టణం ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో గణనీయంగా అభివృద్ధి చెందింది.


8లో



రత్నగిరికి సీఆర్‌ఓ మార్పు

అన్నవరం దేవస్థానంలో సత్రం గదులు అద్దెకిచ్చే సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం (సీఆర్‌ఓ)ను కొండ దిగువ నుంచి రత్నగిరిపైకి సోమవారం మార్చారు.

డెల్టాలకు 7,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 7,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.70 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

విజిలెన్స్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బారెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను కార్యాలయంలోని అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వానికి రావలసిన రెవెన్యూ వసూళ్లలో, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడటంలో, ప్రభుత్వ పథకాల అమలులో అవకతవకలు లేకుండా చూసే విధులలో అధికారులందరూ అంకిత భావంతో పని చేయాలని కోరారు.

ఉద్యోగుల డేటా ఎంట్రీకి ఏర్పాట్లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమగ్ర డేటాను ప్రభుత్వ పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(పీపీఎంఎస్)లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు ఉద్యోగుల డేటా నమోదు, అమలు ప్రణాళికపై కలెక్టరేట్‌లో సోమవారం ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్త జిల్లా పరిధిలో త్వరలో నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల విధి నిర్వహణలో ఎవ్వరికీ ఎటువంటి మినహాయింపులూ ఉండవని స్పష్టం చేశారు. ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారులను హోదా, జీతం ఆధారంగా నియమిస్తామని చెప్పారు. తెలిసో తెలియకో సిబ్బంది డేటా నమోదు చేయకుంటే సంబంధిత డీడీఓనే వ్యక్తిగతంగా బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, 15 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామన్నారు. మంగళవారం నుంచి డేటా ఎంట్రీ ప్రారంభం కానున్నదని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ మాట్లాడుతూ, డేటా ఎంట్రీ స్లాట్ వివరాలను ఇప్పటికే ఆయా అధికారులకు తెలిపామని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

డీపీఓగా రాంబాబు



రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పంచాయతీ అధికారిగా దాసరి రాంబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాపట్ల జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ పనిచేసిన జె.సత్యనారాయణ బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. రాంబాబు బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ కె.మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిశారు.

భద్రం.. బీ కేర్‌ఫుల్ బ్రదర్

- లైసెన్స్ లేకుండానే డ్రైవింగ్
- కుర్రకారు జోరు
- 20 శాతం మంది ఇలాగే రోడ్డు పైకి..
- లైసెన్స్ తప్పనిసరి అంటున్న అధికారులు



డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తిరుగుతున్న వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ద్విచక్ర వాహనాలు, కార్లు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు అవగాహన లేని వాహన చోదకులు డ్రైవింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతూ, ప్రమాదాలకు కారణమవుతోంది. ముఖ్యంగా లైసెన్సు లేకుండానే మోటార్ వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్, నిబంధనలు పాటించకపోవడం వంటివి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి.

ఈ ధోరణి ప్రమాదకరం

రహదారి భద్రతలో భాగంగా ప్రతి వాహన చోదకుడూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. అలాగే, ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. దీనివలన అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు మన శరీరంలో అత్యంత సున్నితమైన మెదడుకు రక్షణ లభిస్తుంది. అయితే ఈ విషయంలో వాహన చోదకుల నుంచి పూర్తి సహకారం ఉండటం లేదు. డ్రైవింగ్ లైసెన్స్ ఉండటం, హెల్మెట్ ధరించడం అనేవి రవాణా, పోలీసు శాఖల కోసమే అన్నట్టు చాలా మంది భావిస్తున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలూ లేకుండానే వాహనాలపై రయ్‌మంటూ రోడ్డు పైకి నిర్లక్ష్యంగా వచ్చేస్తున్న వారే సగం ప్రమాదాలకు కారణమవుతున్నారని అధికారులు చెబుతున్నారు.

దీంతో పాటు చాలామంది తల్లిదండ్రులు మైనారిటీ తీరకుండానే తమ పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. వారు రహదారి నిబంధనలపై ఏమాత్రం అవగాహన లేక.. బైక్‌లు, స్కూటర్లను వేగంగా నడపడం థ్రిల్‌గా భావిస్తూ.. ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో ఎక్కువ మంది మైనర్లు మృత్యువాత పడిన ఘటనలు అనేకం వెలుగు చూశాయి. ఈ పరిస్థితుల్లో వాహనాలు నడిపేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాలని, రహదారి నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడుపుతున్న వారిపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకూ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడానికి సంబంధించి 19,792 కేసులు నమోదు చేశారు. వారికి రూ.39,78,400 జరిమానా విధించారు.

లైసెన్స్ పొందాలిలా..

డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉంటే వాహనం నడపడంపై పూర్తి అవగాహన ఉన్నట్టే. డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసేందుకు రవాణా శాఖ రెండు విధాలుగా పరీక్షలు నిర్వహిస్తుంది. మొదటిది లెర్నర్ లైసెన్స్. మైనారిటీ తీరి, లైసెన్స్ పొందేందుకు సంబంధిత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి రవాణా శాఖ నిర్వహించే ప్రాథమిక పరీక్ష ఇది. ఈ దశలో రహదారి నిబంధనలు, రహదారిపై వాహన చోదకుల అవగాహనకు ఏర్పాటు చేసే వివిధ గుర్తులు, హెచ్చరిక బోర్డులపై అవగాహన కల్పించుకోవాలి. వాహనాలు నడపడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు పూర్తి స్థాయిలో తెలుసుకోవాల్సి ఉంటుంది. రవాణా శాఖ కార్యాలయాల్లో కంప్యూటర్‌పై ఈ పరీక్ష రాయాల్సి ఉంటుంది. రహదారి నిబంధనలపై అవగాహన ఉన్నా మనకు కంప్యూటర్‌పై అవగాహన లేకపోతే ప్రశ్నావళి పూర్తి చేయడంలో అక్కడి సిబ్బంది సహకారం అందిస్తారు. ఇందులో రవాణా శాఖ నిర్దేశించిన కనీస మార్కులు పొందితే లెర్నర్ లైసెన్స్ మంజూరు చేస్తారు.

లెర్నింగ్ లైసెన్స్ పొందిన 40 రోజులలోపు పర్మినెంట్ లైసెన్స్ పొందాలి. ఇది పొందాలనుకునే వారు రవాణా శాఖ అధికారుల పర్యవేక్షణలో స్వయంగా వాహనం నడిపి చూపాలి. డ్రైవింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన ఉందని అధికారులు నిర్ధారించుకున్న తరువాత పర్మినెంట్ లైసెన్స్ మంజూరు చేస్తారు. ఇటీవల సవరించిన నిబంధనల ప్రకారం డ్రైవింగ్ స్కూళ్లు తమ వద్ద నేర్చుకున్న వాహన చోదకులకు లైసెన్స్ మంజూరయ్యే వరకూ సహకారం అందించే విధంగా చర్యలు చేపట్టారు.

గత ఏడాది, ఈ ఏడాది జనవరి నెలలో కేసులు.. జరిమానా (రూ.లలో)

నేరం	కేసులు	జరిమానా
2003 జనవరి – డిసెంబర్		
లైసెన్స్ లేకుండా డ్రైవింగ్	4,945	24,72,500
హెల్మెట్ లేకుండా డ్రైవింగ్	14,504	14,50,400
గత జనవరిలో..		
లైసెన్స్ లేకుండా డ్రైవింగ్	53	26,500
హెల్మెట్ లేకుండా డ్రైవింగ్	290	29,000

లైసెన్స్ లేకపోతే..

డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం వల్ల వాహన చోదకులకు అనేక ప్రయోజనాలుంటాయి. రహదారిపై తిరిగే ప్రతి వాహనానికి దాని కండీషన్ ఎంత ముఖ్యమో ఇన్సూరెన్స్ కూడా అంతే ముఖ్యం. ప్రమాదాలు జరిగిన సమయంలో వాహనం నడిపిన వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే అతడితో పాటు వాహన యజమానిపై కూడా క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. ప్రమాద తీవ్రతను బట్టి డ్రైవింగ్‌లో నిర్లక్ష్యంతో పాటు లైసెన్స్ లేకుండా వాహనం నడపడాన్ని తీవ్ర తప్పిదంగా పరిగణించి జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఆ వాహనానికి పూర్తి స్థాయిలో ప్రమాద బీమా ఉన్నా లైసెన్స్ లేని వాహన చోదకుడికి అది వర్తించదు. అందువల్ల వాహనం నడిపి, ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఎటువంటి నష్టపరిహారం అందదు.

వారికి వాహనం ఇవ్వొద్దు

చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు మైనారిటీ తీరకుండానే వాహనాలు నడపడం చూసి ఆనందపడుతుంటారు. ఆ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే దాని వలన ఎదురయ్యే నష్టాన్ని ఊహించరు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనం ఇవ్వడం నేరమనే విషయం గుర్తించరు. ఎటువంటి పరిపక్వతా లేని డ్రైవింగ్ కారణంగా పిల్లలు మృత్యువాత పడిన సందర్భాల్లో ఆ విషాదానికి తమ నిర్లక్ష్యమే కారణమైందని పెద్దలు బాధపడినా ప్రయోజనం ఉండదు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నప్పటికీ ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం వంటి తప్పిదాలు కూడా ప్రమాదాలకు కారణమవుతాయి. అందువలన మార్పు తప్పనిసరిగా తల్లిదండ్రుల నుంచే మొదలు కావాలి. పిల్లలు డ్రైవింగ్ లైసెన్స్ పొందేంత వరకూ వాహనం ఇవ్వకూడదు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



వాహనం నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. లైసెన్స్ పొందేందుకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని, ఆర్‌టీఓ కార్యాలయానికి వస్తే 10 నిమిషాల పాటు 20 మల్టిపుల్ ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తాం. అందులో 12 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇస్తే పరీక్ష పాసై ప్రాథమిక ధ్రువపత్రం (లెర్నర్ లైసెన్స్) వస్తుంది. మరో నెల రోజుల తర్వాత పర్మినెంట్ లైసెన్సుకు దరఖాస్తు చేసుకుని రావాలి. లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరం. అవగాహన లేకుండా వాహనం నడిపి, జీవితాన్ని కష్టాలమయం చేసుకోవద్దు.

– కృష్ణారావు, జిల్లా రవాణా అధికారి (డీటీఓ), రాజమహేంద్రవరం

స్పందనకు 174 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 174 అర్జీలు వచ్చాయి. వీటిలో ఆన్‌లైన్‌లో 151, ఆఫ్‌లైన్‌లో 23 వచ్చాయని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు, ఇతర జిల్లా అధికారులతో కలసి ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. వీటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పోలీసు స్పందనకు 31 ఫిర్యాదులు



మహిళ సమస్య వింటున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందకు 31 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ పి.జగదీష్ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో బాధితుల సమక్షంలో ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో నేరుగా మాట్లాడి ఫిర్యాదీల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీసు స్పందనకు వచ్చి ఫిర్యాదుల్లో సివిల్ కేసులకు సంబంధించి 3, కుటుంబ కలహాలు 4, చీటింగ్ 9, సైబర్ నేరాలు 3, ఇతర ఫిర్యాదులు 12 ఉన్నాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు కూడా పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్ కార్మికుల వేతనాలపై నిర్ణయం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికులకు రోజువారీ వేతనాలు నిర్ణయించామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఈ వేతనాలను ఆమె ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నైపుణ్యం కలిగిన వారికి రోజుకు రూ.827, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.687, నైపుణ్యం లేని వారికి రూ.560 చొప్పున రోజువారీ వేతనం చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ, పంచాయతీరాజ్ ఎస్ఈ మహ్మద్ ఆలీముల్లా, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో మంగళవారం పలు గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అన్నదేవరపేట-1 (తాళ్లపూడి), సింగంపల్లి (రంగంపేట), పల్లకడియం (రాజానగరం), కోలమూరు-2 (రాజమహేంద్రవరం రూరల్), కానూరు-1 (పెరవలి), తోగుమ్మి (కొవ్వూరు), కడియపు సావరం-1 (కడియం), కొవ్వూరుపాడు (గోపాలపురం), కొత్తపల్లి-1 (గోకవరం), దుద్దుకూరు-2 (దేవరపల్లి), కొంకుదురు-1 (బిక్కవోలు), పెడపర్తి (అనపర్తి) సచివాలయాల పరిధిలో ఈ వైద్య శిబిరాలు జరుగుతాయని వివరించారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొవ్వాడ అడవికి చేరిన పులి

దేవరపల్లి: తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఐదు మండలాల ప్రజలను కొద్ది రోజులుగా వణికించిన పెద్దపులి ఎట్టకేలకు కొవ్వాడ వద్ద రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ప్రవేశించింది. రాజమహేంద్రవరం అటవీ రేంజ్ అధికారి ఎల్.ధనరాజు సోమవారం ఈ విషయం తెలిపారు. గోపాలపురం మండలం కరగపాడు వద్ద పెంపుడు పందిపై పెద్ద పులి శనివారం దాడి చేసి చంపింది వాస్తవమేనని చెప్పారు. ఆ పంది యజమానికి రూ.4 వేల నష్టపరిహారం అందజేశామని తెలిపారు. ప్రస్తుతం పులి పాదముద్రలు అటవీ ప్రాంతం వైపు ఉన్నాయని చెప్పారు. అక్కడి నుంచి అది పాపికొండలు అభయారణ్యంలోకి చేరవచ్చునని అన్నారు. అయినప్పటికీ కొవ్వాడ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉదయం 9 గంటల వరకూ రైతులు పొలాలకు వెళ్లవద్దని, సాయంత్రం 5 గంటల్లోగా తిరిగి ఇళ్లకు చేరుకోవాలని, పశువులను ఇళ్ల వద్దకు చేర్చుకోవాలని ధనరాజు సూచించారు. పులి సంచారంపై వాట్సాప్‌లో అసత్య ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఆర్‌ఓ వేణుగోపాల్, ఎఫ్‌బీఓ కార్తిక్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 99.03 శాతం పూర్తి



విశాఖకు వెళ్లి వట్టూరి సూర్యనారాయణమూర్తికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లాజర్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ 99.03 శాతం పూర్తయిందని డీఆర్‌డీఏ – వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీఎస్ మూర్తి సోమవారం తెలిపారు. మొత్తం 2,45,652 పింఛనుదారులకు రూ.72.92 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 2,43,257 మందికి రూ.72.19 కోట్లు పంపిణీ చేశామని వివరించారు.

తాళ్లపూడి మండలం 99.43 శాతంతో ప్రథమ, కడియం మండలం 98.77 శాతంతో చివరి స్థానాల్లో నిలిచాయన్నారు. పిడింగొయ్యి-4 గ్రామ సచివాలయం పరిధిలోని వట్టూరి సూర్యనారాయణమూర్తి విశాఖలో ఉంటున్నారు. ఆ గ్రామ వలంటీర్ జంజం లాజర్ విశాఖ వెళ్లి మరీ ఆయనకు వృద్ధాప్య పింఛన్ అందించారు.

చదువు.. సంపాదన

- సీఎస్ఈ, ఈసీఈ ఫైనల్ విద్యార్థులకు అవకాశం
- ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌గా అవకాశం
- ఇంటర్న్‌షిప్ సమయంలోనే రూ.12 వేల స్టైపెండ్



ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌గా ఎంపికైన ఇంజినీరింగ్ విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ)/రాయవరం: జూనియర్లకు పాఠాలు చెప్పడం ద్వారా చదువుకుంటూనే సంపాదించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ విద్యార్థులకు కల్పించింది. వారిని భవిష్యత్ నైపుణ్య నిపుణులుగా (ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్) తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ, ఎంసీఏ ఫైనలియర్ విద్యార్థులకు ఉన్నత పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వీరు ఫ్యూచర్ స్కిల్స్ అందించాల్సి ఉంటుంది. ఈ ఇంటర్న్‌షిప్‌నకు ఎంపిక చేసిన ఇంజినీరింగ్ విద్యార్థులకు నెలకు రూ.12 వేల స్టైపెండ్ అందజేస్తారు. దీంతో పాటు వారు వర్చువల్‌గా మరో ఇంటర్న్‌షిప్ చేసుకునే అవకాశం కూడా కల్పించారు. ఉన్నత విద్యలో ఆరు నెలల ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో పాఠశాలకు ముగ్గురు

కాకినాడ జేఎన్‌టీయూ (జేఎన్‌టీయూకే) పరిధిలోని 155 ఇంజినీరింగ్ కళాశాలల్లో 766 మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. వీరిని మొత్తం 2,298 ఉన్నత పాఠశాలలకు కేటాయించారు. ఒక్కో పాఠశాలకు ముగ్గురు చొప్పున నియమితులయ్యారు. వీరి ద్వారా 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తారు. అలాగే, ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్ అందించాలి. భవిష్యత్తులో బోధన రంగంలో రాణించాలనుకునే వారికి, ఉద్యోగం, మార్కెట్ ఓరియెంటెడ్ కోర్సులు నేర్చుకోవాలనుకునే వారికి కూడా ఈ ఇంటర్న్‌షిప్ దోహదపడుతుంది.

పాఠశాలలకు మ్యాపింగ్

ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌గా నియమించిన వారిని వారి కళాశాలలకు సమీపంలోని ఉన్నత పాఠశాలలకు మ్యా పింగ్ చేశారు. ఒక్కో ఇంజినీరింగ్ విద్యార్థి తనకు కేటాయించిన మూడు పాఠశాలల్లోని విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై నాలుగు నెలల పాటు అవగాహన క ల్పిస్తారు. వారానికి రెండు రోజులు ఆయా పాఠశాలల కు వెళ్లి ఉన్నత తరగతుల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు.

ఈ కోర్సుల్లో శిక్షణ

ఫ్యూచర్ స్కిల్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), బ్లాక్ చైన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), మెటావర్స్/వెబ్ 3.0, మోడలింగ్ అండ్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటరింగ్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా/డేటా ఎనలిస్ట్, రోబోటిక్స్‌లో బేసిక్స్‌పై అవగాహన కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్‌ను అందజేసింది. ఉపాధ్యాయులకు డిజిటల్ పరికరాలపై విద్యా బోధన, హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్స్ వినియోగంపై కూడా ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్ శిక్షణ ఇస్తున్నారు. కొత్త కంటెంట్ ఇన్‌స్టాల్ చేసి కూడా అందిస్తారు.

ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌ను నియమించారిలా..

జిల్లా	పాఠశాలలు	నియమితులైనవారు
కాకినాడ	194	65
కోనసీమ	216	74
తూర్పు గోదావరి	183	67

గొప్ప మార్పునకు నాంది



ప్రభుత్వ నిర్ణయం గొప్ప మార్పునకు నాంది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర విద్యార్థులు చదువుతో పాటే సంపాదించుకోనున్నారు. విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ బడుల్లో డిజిటల్ లిటరసీ పెరుగనుంది. విద్యార్థులు ఇప్పటికే స్మార్ట్ ప్యానల్స్‌పై పాఠాలు వింటున్నారు. వీటి ద్వారా మరింత నాణ్యమైన సాంకేతిక పాఠాలు నేర్పించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌నకు పంపాలన్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఉప కులపతి, జేఎన్‌టీయూకే

ఇంజినీరింగ్ విద్యార్థులకు క్రెడిట్లు



ఫ్యూచర్ స్కిల్ ప్రోగ్రామ్‌కు సంబంధించి నెలకు రూ.12 వేల స్టైపెండ్‌తో పాటు ఆ విద్యార్థులకు ఇంజినీరింగ్ డిగ్రీలో క్రెడిట్స్ కూడా కలుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానం దేశ చరిత్రలోనే తొలిసారి కావడం మనకు గర్వకారణం.

– డాక్టర్ సీహెచ్ సాయిబాబు, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్

కొత్త అనుభూతినిచ్చింది



ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి ఫ్యూచర్ స్కిల్స్‌పై విద్యార్థులకు చెప్పే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. చదువుకుంటూనే తిరిగి చెప్పడం కొత్త అనుభూతినిస్తోంది. ఇంటర్న్‌షిప్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా దగ్గరలోనే పొందడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లయింది.

– ఇళ్ల బాల నాగ ప్రవీణ్, ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్, ముమ్మిడివరం

తరగతులకు హాజరవుతున్నా

నాకు కేటాయించిన మూడు పాఠశాలల్లోని విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు వెళ్తున్నాను. ఇంజినీరింగ్ ఈసీఈ చదువుతున్నాను. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు తెలియని సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నాను. ఇది చాలా ఆనందంగా ఉంది. ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్‌గా స్టైపెండ్ కూడా అందజేయడం సంతోషాన్నిస్తోంది.

– కలిదిండి తరుణి, ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్, రాజోలు

9న డీవార్మింగ్ డే

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఈ నెల 9న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని (డీవార్మింగ్ డే) విజయవంతం చేయాలని కలెక్టర్ కె.మాధవీలత సంబంధిత సమన్వయ అధికారులను ఆదేశించారు. డీవార్మింగ్ డే పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆమె సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నులిపురుగుల వలన పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందని అన్నారు. డీవార్మింగ్ డే సందర్భంగా పిల్లల్లో నులిపురుగుల నివారణకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆ రోజు ఆ మాత్రలు తీసుకోని పిల్లలకు 10, 11 తేదీల్లో విధిగా అందించాలని స్పష్టం చేశారు. ఏడాది నుంచి ఐదేళ్ల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోను, 6 నుంచి 19 సంవత్సరాల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరుగుతుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొసలి సంచారంపై గ్రామస్తుల ఆందోళన

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరంలో మొసలి సంచరిస్తోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో అమలాపురం – చల్లపల్లి ప్రధాన పంట కాలువలో మొసలి సంచరించగా.. దానిని అమలాపురం రూరల్ మండలం సమనసలో అటవీశాఖ అధికారులు బంధించి మారేడుమిల్లి ప్రాంతంలో వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. గోపవరం పంచాయతీ పరిధి జయపురం ప్రాంతంలో సోమవారం తెల్లవారు జామున అటుగా వెళ్తున్న కల్లుగీత కార్మికునికి మొసలి కనిపించిందని చెప్పటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆ ప్రాంతంలో కాలువ ఒడ్డున మొసలి పాదాల జాడలు చూశామని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై గ్రామ సర్పంచ్ కుంచే బుల్లియ్య దండోరా వేయించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియపరిచారు. ఈ విషయంపై వీఆర్వో నాగరాజును వివరణ కోరగా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియపరిచానన్నారు.

12న ప్రైమ్ మినిస్టర్ అప్రెంటిస్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12వ తేదిన ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఐటీఐలు పూర్తిచేసి ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన అభ్యర్థులు హాజరుకావచ్చని, ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు వచ్చి తమకు కావలసిన అప్రెంటిస్‌లను ఎంపిక చేసుకుంటారన్నారు. వివరాలకు 86392 30775 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

మండపేటలో ప్రగతి జెండా

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన
- ప్రభుత్వ చిత్తశుద్ధితో పట్టణాభివృద్ధి
- ప్రజాదరణతో ముందుకు సాగుతున్న కౌన్సిల్
- తోడ్పాటునిస్తున్న ఎమ్మెల్సీ తోట
- గత ప్రభుత్వ పాలన కంటే అనేక రెట్లు అభివృద్ధి
- పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యం



మండపేట మున్సిపల్ కార్యాలయం

కపిలేశ్వరపురం (మండపేట): మాస్, క్లాస్ కలబోసిన పట్టణం మండపేట. పట్టణం చుట్టూ పచ్చని పొలాలు.. పశుసంపదకు పెట్టింది పేరు.. మూడు నియోజకవర్గాలకు వ్యాపార కేంద్రం. ఇంతటి ప్రాధాన్యం గల మండపేట పట్టణం గత ఐదేళ్లలో గణనీయంగా మెరుగుపడింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ పట్టణాభివృద్ధికి తోడ్పాటునిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమన్వయం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంది. పేద, మధ్య తరగతి ప్రజలకు పారదర్శకంగా సంక్షేమాన్ని అందిస్తోంది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పూర్తి సహకారంతో చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆధ్వర్యంలో కౌన్సిల్ సభ్యులు పట్టణాన్ని నడిపిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అంతంత మాత్రంగా ఉన్న పట్టణ పరిస్థితులను ప్రస్తుత పాలక పక్షం విశేషంగా మెరుగుపర్చింది. పట్టణంలోని ఏమూలకు వెళ్లినా ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కనిపిస్తుంది. గత ఐదేళ్ల పట్టణాభివృద్ధిపై ఈ కథనం...

ఇదీ ముఖచిత్రం

మున్సిపాలిటీ ఏర్పాటు	: 1958
విస్తీర్ణం	: 21.65 చదరపు కిలోమీటర్లు
జనాభా	: 53,588 (2011 జనాభా లెక్కల ప్రకారం)
మొత్తం ఓటర్లు	: 48,150
పురుష ఓటర్లు	: 22,825
మహిళా ఓటర్లు	: 25,325
పోలింగ్ స్టేషన్లు	: 45
నివాసాలు	: 15,334
వార్డులు	: 30

పేదలకు వైద్యం మెరుగు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాక ముందు మెయిన్‌రోడ్డులో ఒక ప్రభుత్వ ఆసుపత్రి, హరిజనవాడలో ఒక అర్బన్ హెల్త్ సెంటర్ మాత్రమే ఉండేవి. ఈ ఏడాది మేలో 20వ వార్డులోని డాక్టర్ వైఎస్సార్ జగనన్న హౌసింగ్ కాలనీలో రూ.95 లక్షలతో మరో అర్బన్ పీహెచ్‌సీని నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చారు. హరిజనపేటలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను రూ.10 లక్షలతో ఆధునీకరించారు. ప్రభుత్వ వైద్య సామర్థ్యం మరింత పెరగాలన్న లక్ష్యంతో ప్రధాన రహదారి సమీపంలో వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేయగా నిర్మాణ దశలో ఉంది. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పేరుతో 345 మందికి వైద్య పరీక్షలు చేసి కళ్ల జోళ్లు పంపిణీ చేసేందుకు రూ.62 లక్షలు ఖర్చు చేశారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పేరుతో 1,026 మందికి రూ.1.52 కోట్ల ఖర్చుతో పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తున్నారు.

పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య

పట్టణంలో 18 మున్సిపల్, ఒక జెడ్పీ, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మొత్తం 20 పాఠశాలలున్నాయి. నాడు –నేడు పథకంలో రూ.4.26 కోట్లతో పాఠశాలలను ఆధునీకరిస్తున్నారు. వాటిలో రూ.57.50 లక్షలతో ఆరు పాఠశాలలను ఆధునీకరించారు. మిగిలిన 12 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషిస్తున్నారు. విద్యాకానుక పథకం ద్వారా 2,154 మందికి రూ.1.53 కోట్లు ఖర్చు చేశారు. 329 మంది విద్యార్థులకు రూ.44 లక్షల విలువైన ట్యాబ్‌లను ప్రభుత్వం అందజేసింది. 2,172 మంది లబ్ధిదారులకు 2.16 కోట్లతో జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నారు.

రహదారుల నిర్మాణం

14, 15 ఆర్థి సంఘం నిధులు, సాధారణ నిధులతో రహదారుల నిర్మాణం చేపట్టారు. 9.54 కిలోమీటర్ల విస్తీర్ణంలోని 72 రహదారుల నిర్మాణానికి రూ.9.92 కోట్లు మంజూరయ్యాయి. వాటిలో 7.87 కిలోమీటర్లు విస్తీర్ణంలోని రూ.7.77 కోట్ల విలువగల 42 రహదారుల నిర్మాణం పూర్తయింది. 1.67 కిలోమీటర్ల మేర రూ.2.15 కోట్ల ఖర్చుతో 30 రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. రూ.58 లక్షల విలువగల రెండు రహదారులు ప్రతిపాదనల దశలో ఉన్నాయి.

పారిశుధ్యం పరిరక్షణ

క్లీన్ మండపేట లక్ష్యంగా చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో రోజుకు 26 టన్నుల వ్యర్థాలు పోగుబడుతున్నాయి. పట్టణంలో వినియోగంలో ఉన్న 2.5 ఎకరాల డంపింగ్ యార్డు సరిపోకపోవడంతో పదేళ్ల క్రితం 2.75 ఎకరాల స్థలాన్ని సేకరించారు. అందుకోసం మున్సిపల్ నిధులు రూ.1.2 కోట్లను రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు చెల్లించారు. అయితే స్థల యజమానులు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్థల యజమానులతో చర్చించి కేసులను ఉపసంహరించుకునేలా కృషి చేశారు. గతేడాది రూ.2.14 కోట్లు స్థల యజమానులకు చెల్లించి సెప్టెంబర్ 16న స్థలాన్ని మున్సిపల్ అధికారులు స్వాధీన పర్చుకున్నారు. రూ.2.65 కోట్లతో 3.10 కిలోమీటర్లు మేర 54 డ్రెయిన్లను మంజూరుచేయగా రూ.2.05 కోట్లతో 2.52 కిలోమీటర్ల మేర 48 డ్రైనేజీలు పూర్తయ్యాయి. రూ.60 లక్షల విలువైన 0.58 కిలోమీటర్ల ఆరు డ్రైనేజీలు నిర్మాణంలో ఉన్నాయి. రూ.9.50 లక్షల విలువైన 0.18 కిలోమీటర్లు మేర ఒక డ్రైను నిర్మాణానికి ప్రతిపాదనలను పంపారు.

తాగునీటి సదుపాయం మెరుగు : మున్సిపల్ సాధారణ నిధులు, 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఏఐఐబీ నిధులతో తాగునీటి పథకాలను అమలు చేస్తున్నారు. రూ.1.20 కోట్లతో 4.75 కిలోమీటర్లు మేర తాగునీరు సరఫరా సదుపాయాన్ని విస్తరింపజేశారు. తాగునీటి సరఫరా సామర్థ్యాన్ని పెంచేలక్ష్యంతో రూ.24 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. పట్టణ ప్రజలకు రోజుకు 5.95 లీటర్లు సరఫరా చేస్తున్నారు. టిడ్కో ఫ్లాట్ల వద్ద ప్రతీ బ్లాక్ మధ్యలో ఒక్కొక్కటి చొప్పున రూ.30 లక్షలతో 10 చేతి పంపులను ఏర్పాటు చేశారు. వాటికి హెడ్‌లను అమర్చి వినియోగంలోకి తేనున్నారు.

పేదలందరికీ ఇళ్లు : పట్టణానికి చెందిన 2,120 మందికి నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకం ద్వారా వేములపల్లిలో ఇళ్ల స్థలాలను ఇవ్వడం ద్వారా పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానికి దక్కింది. అందుకోసం 38.16 కోట్లను ఖర్చు చేసింది. వాటిలో 345 మంది తమ ఇళ్లను నిర్మించుకున్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. లబ్ధిదారునికి ఆర్థిక సాయం చేయడంతో పాటు కొంతమేర మెటీరియల్‌ను సమకూర్చుతున్నారు. ఏపీటిడ్కో–పీఎంఏవై–జగనన్న నగర్‌లలో రూ.4.82 కోట్ల విలువ చేసే 6,128 టిడ్కో ఫ్లాట్లు మంజూరయ్యాయి. మొత్తం ఫ్లాట్ల నిర్మాణం పూర్తయింది. గత టీడీపీ ప్రభుత్వం ఫ్లాట్ల వద్ద సదుపాయాలు కల్పించకుండా ఎన్నికల వేళ హడావుడిగా గృహప్రవేశాలు చేయించింది. లబ్ధిదారులు ఫ్లాట్లలోకి రాకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించి బ్లాక్‌లలో ఫ్లాట్లను లబ్ధిదారులకు అందజేసింది. రెండో విడత ఫ్లాట్లను పంపిణీకి సిద్ధం చేసింది.

ఉద్యోగావకాశాలు : 20,422 నివాసాలకు ఒక్కో సచివాలయం చొప్పున పట్టణంలో 14 వార్డు సచివాలయాలు ఏర్పాటు అయ్యాయి. వాటిద్వారా 504 మంది పలు ప్రభుత్వ శాఖల ద్వారా ఉద్యోగావకాశాలు పొందారు. అవి నాణ్యతలేని ఉద్యోగాలంటూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయగా దానికి చెక్ పెడుతూ ప్రొబేషన్ పూర్తి చేసిన ఉద్యోగులను ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మరెన్నో అభివృద్ధి పనులు...

- పట్టణంలోని పార్కులను ప్రభుత్వం విశేషంగా అభివృద్ధి చేస్తుంది. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మెమోరియల్ మున్సిపల్ పార్క్ నడకదారిని టైల్స్‌తో మెరుగుపరుస్తున్నారు.
- పట్టణంలో 3,296 ఎల్ఈడీ బల్బులు సమకూర్చారు.


డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ మున్సిపల్ పార్క్


గొల్లపుంతలో టిడ్కో ఇళ్లు


నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనం

సంక్షేమంతో సామాన్యులకు ఆసరా

- జగనన్న తోడు పథకం పేరుతో పట్టణంలోని 9,428 మందికి రూ.9.42 కోట్ల విలువైన రుణాలను అందించారు. 533 మంది రజకులు, దర్జీలు, నాయీబ్రాహ్మణులులకు ఒక్కొక్కరి ఖాతాకు రూ.10వేలు చొప్పున ఐదేళ్లలో రూ.1.45 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం జమ చేసింది.
- వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా సొంతంగా ఆటో కలిగిన కార్మికుడికి ఏడాదికి రూ.10వేల చొప్పున పట్టణంలోని 164 మంది ఆటో కార్మికులకు ఐదేళ్లలో రూ.69 లక్షల ఆర్థిక సాయాన్ని పారదర్శకంగా వారి ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసింది.

ప్రజాదరణతో పట్టణాభివృద్ధి



మండపేట పట్టణ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు. అందుకే పెత్తందార్లను పక్కనపెట్టి ప్రజల్లో పనిచేసేవారిని గెలిపించుకున్నారు. పట్టణ ప్రజలు నన్ను విశేషంగా ఆదరిస్తున్నారు. సంక్షేమ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి పట్టణాభివృద్ధికి తోడ్పాటైంది. విద్య, వైద్యం, ఆరోగ్యం, అభివృద్ధి అంశాల్లో ప్రస్తుత పాలకవర్గం పట్టణాన్ని అభివృద్ధి చేసింది.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవ, సహకారంతో పట్టణంలో మెరుగైన పాలనను అందిస్తున్నాం. అధికారు లు, కౌన్సిల్ సభ్యుల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యమిస్తూ పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నాం.

– పతివాడ నూక దుర్గారాణి, చైర్‌పర్సన్

ప్రభుత్వ శాఖల సమన్వయంతో అభివృద్ధి



మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారు. గత ఐదేళ్లలో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనకరమయ్యాయి. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నాం.

– టి.కనకరాజు, మున్సిపల్ మేనేజర్, మండపేట

డీఏ మంజూరుపై వీఆర్ఏల కృతజ్ఞతలు

అమలాపురం రూరల్: గ్రామ రెవెన్యూ సహాయకులకు డీఏ రూ.500 మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి తూర్పుగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సమావేశం కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం అమలాపురం అంబేద్కడ్కర్ భవనంలో సోమవారం జరిగింది. డీఏ మంజూరుకు కృషి చేసిన ఏపీ రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వీఎస్ దివాకర్‌ను సంఘం తరవున సత్కరించారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వీరభద్రరావు,సంఘం నాయకులు మోకా శ్రీను, అంజలిరావు పాల్గొన్నారు.


దివాకర్‌ను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

తప్పిపోయిన బాలిక.. తల్లిదండ్రులకు అప్పగింత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తప్పిపోయిన బాలికను ప్రకాశ్‌నగర్ పోలీసులు సోమవా రం తల్లిదండ్రులకు అప్పగించారు. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఈ నెల 4వ తేదీన తన తల్లిదండ్రులు మందలించడంతో రాత్రి 7.30 గంటలకు ఇంటి నుంచి పారిపోయింది. తన కుమార్తె రాజమహేంద్రవరం బస్సు స్టేషన్‌లో ఉన్నట్లుగా గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే సమాచారాన్ని ప్రకాష్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు తెలిపారు. సీఐ సిబ్బందిని అప్రమత్తం చేసి ఆ బాలికను రక్షించి, పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆ బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రకాష్‌నగర్ సీఐ, పోలీసు సిబ్బందిని ఎస్పీ పి.జగదీష్ అభినందించారు. తన కుమార్తెను అప్పగించిన పోలీసులకు ఆ బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

తుని: ఇంట్లో అలిగి అన్నవరం రైల్వేస్టేషన్‌కు వచ్చిన బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు స్థానిక జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి పట్టణానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటి నుంచి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. అన్నవరం రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా కనిపించడంతో జీఆర్పీ కానిస్టేబుళ్లు శ్యామ్ త్రినాథ్, సూర్య ప్రకాష్ నాగసాయి దేవికను ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో తుని జీఆర్పీ సేషన్‌కు తీసుకువచ్చారు. జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ బాలికను ప్రశ్నించడంతో అత్తిలి పట్టణమని చెప్పగా, అత్తిలి పోలీసులకు ఫోన్ చేశారు. తమ పోలీస్ స్టేషన్‌లో బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి తుని జీఆర్పీ స్టేషన్‌కు రప్పించారు. బాలికను వారికి అప్పగించినట్టు ఎస్సై అబ్‌దుల్ మారూఫ్ తెలిపారు.

రత్నగిరికి సీఆర్వో మార్పు

'సాక్షి'లో వచ్చిన 'సత్రం గదుల సిత్రం' కథనంతో చక చకా మార్పులు


రత్నగిరిపై సీఆర్వో

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సత్రం గదులు అద్దెకిచ్చే సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం (సీఆర్వో)ను కొండ దిగువ నుంచి రత్నగిరిపై ప్రకాష్ సదన్ సమీపంలో గల పాత సీఆర్వో కార్యాలయానికి సోమవారం మార్పు చేశారు. వివాహ బృందాలకు సత్రాలలో గదులు, వివాహ మంటపాలు ఇకపై ఇక్కడే రిజర్వ్ చేస్తారు. వివాహానికి నెల రోజులు ముందు ఇక్కడ వధూవరుల, వారి తల్లితండ్రుల ఆధార్ కార్డులు, శుభలేఖ లేదా లగ్నపత్రిక నకలు రిజర్వేషన్ దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భక్తులకు సత్రం గదుల కేటాయింపు ఆయా సత్రాలలోనే జరుగుతోంది. కాకపోతే ఆధార్ కార్డును ఆయా సత్రాల సిబ్బందికి సమర్పించాలి. చెకిన్, చెకౌట్ కూడా ఆ సత్రాలలోనే భక్తులు చేయాల్సి ఉంటుంది. కాకపోతే ఏ సత్రం ఎక్కడుందో భక్తులకు ఇక్కడ సమాచారం తెలిసే అవకాశం ఉంటుంది. త్వరలోనే సీఆర్వో కార్యాలయంలో కూడా సత్రం గదులు అద్దెకిచ్చే విదంగా ఏర్పాట్లు చేయనున్నారు. భక్తుల వద్ద నుంచి నగదు, అడ్వాన్స్ తీసుకుని ఇక్కడే సత్రం గదులు కేటాయించాలా లేక సత్రం గది మాత్రం కేటాయించినట్టు రశీదు ఇచ్చి నగదు, అడ్వాన్స్ ఆయా సత్రాలలో గుమస్తాలకు చెల్లించి గదులు తీసుకునేలా, ఖాళీ చేసే సమయంలో తిరిగి ఆ సత్రంలోనే భక్తులకు అడ్వాన్స్ చెల్లించేలా ఏర్పాట్లు చేయాలా అనే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. కొండ దిగువకు సీఆర్వో కార్యాలయం మార్చడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గత మంగళవారం సాక్షి దినపత్రికలో 'సత్రం గదుల సిత్రం' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ సీఆర్వో కార్యాలయాన్ని రత్నగిరికి మార్పు చేయాలని ఆదేశించారు. కాగా, సీఆర్వో కార్యాలయం వద్ద ఏ సత్రం వద్ద ఎన్ని గదులు ఖాళీ ఉన్నాయో తెలిపే డిజిటల్ డిస్‌ప్లే బోర్డు లు కూడా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

రుగ్వేద మహాసభలు ప్రారంభం


ముంగండలో వేద పఠనం చేస్తున్న రుగ్వేద పండితులు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని చింతామణి గణపతి మందిరంలో శ్రీ ఆశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సంపూర్ణ రుగ్వేద సంహిత, బ్రాహ్మణ, అరణ్యక, ఉపనిషత్‌ల పారాయణ, వేద విద్వత్ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఉమామహేశ్వర స్వామి ఆలయం నుంచి సభాస్థలి వరకూ గ్రామ ప్రదక్షిణ జరిగింది. చింతామణి గణపతి మందిరంలో గణపతి పూజ, అఖండ స్థాపన, వేద పురుష కలశ స్థాపన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రుగ్వేద సంహిత పారాయణ జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 60 మంది విద్వాంసులు వేద పఠనం చేశారు. మూడు రోజులపాటు ఈ సభలు జరుగుతాయి. కార్యక్రమాల్లో శ్రీఅశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోదావరి వెంకట సుబ్బారావు, చెరుకూరి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, సహ కార్యదర్శి గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి, సభ్యులు, వేద రక్షకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆ జీవన శైలి ఆరోగ్యకరం

'నన్నయ'లో ప్రారంభమైన గిరిజన సంస్కృతి మహోత్సవాలు


అంబేడ్కర్, జ్యోతిరావు, అల్లూరి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు, అధికారులు

రాజానగరం: భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఒక భాగంగా ఉన్నాయని, వాటిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. అడవి బిడ్డలుగా ఉన్న వారి జీవన విధానం ఒక ప్రత్యేక శైలిలో ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్)జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే గిరిజన సంస్కృతి మహోత్సవాలను సోమవారం ప్రారంభించారు. తొలుత విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, కళలతోనే సమాజ వికాసం ఉంటుందన్నారు.

టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప, కార్యదర్శి విష్ణునాయక్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధిలో నాటికి, నేటికీ పెద్దగా తేడా లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయనిర్మల మాట్లాడుతూ విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చన్నారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలన్నారు. ముందుగా యూనివర్సిటీ ముఖద్వారం నుంచి అతిథులకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ నాయక్, రాష్ట్ర, జిల్లా సంఘాల ప్రతినిధులు రాజ్‌కుమార్‌రెడ్డి, భగవాన్, దొర, వెస్లీ, రఘు, రామరాజు, వెంకటేష్, మల్లేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.